# ఒక చిన్న మాట...

"ఏమండోయ్ శ్రీవారూ. ఒక చిన్నమాట" మనసంత వసంతకోయిలైపోయింది భర్తముందు భరతనాట్యం చెయ్యాలన్పించిందేమో!

"చిన్నా చితక మాటెందుగ్గాని పెద్దమాటల మూటనే విప్పేసేయ్" పద్మారావు పెదాలమీద చిరునవ్వు చిందులేసింది మంచమ్మీంచి గబుక్కున లేచి నడుమందుకున్నాడు.

"అబ్బా. ఉడుంపట్టు.. వదిలెయ్యండి! ప్లీజ్" సిగ్గులు పూసి బుగ్గలు ఎర్రబారినై.

"నేనిప్పుడే స్నానం చేసొచ్చానండీ!" "ఆలూమొగలమై ఆర్నెల్లన్నా కాలేదు. అప్పుడే వదిలెయ్యాల్నా?" చెంపలందుకున్నాడు. ముద్దుల ముద్రలు పడిపోతున్నై.

"లేడికి లేచిందే పరుగన్నట్టు ... తెల్లారగానే సరససల్లాపాలా? పొద్దు బారెడెక్కినా పోకిరివేషాలు మానరా?" విడిపించుకుందామంటే మనసొప్పలేదు. కౌగిట్లో బందీ అయిపోయిది. "సిగ్గులేదూ!" కనురెప్పలు టపటపలాడినై.

"బోలెడుంది. పెళ్ళాం ముందు సిగ్గెందుకూ... బొగ్గు?"

"అయ్యో... మీ నాజూకు మీసాలు నా చెంపల్ని తాకితే నరాలు జివ్వుమంటున్నాయి తెల్సా!" కుంకుమ బొట్టు తళుక్కుమంది

"నీఅందాన్నంతా చిదిమి దీపం బెట్టుకోవచ్చోయ్!"

"అందాలకేం గాని ... వదలండీ... ఆఫీసుకెళ్లరా ఈ రోజు? మన పెళ్ళై ఆర్నెల్లు దాటింది మహాప్రభో!"

"ఏందో వసంతా! పెళ్ళై ఆర్నెల్లైనా . నాకైతే ఆర్రోజులు కూడా కానట్టనిపిస్తుంది. చెక్కిన నీ చక్కని ముక్కు, దాన్ని కాపలా కాస్తున్న కాటుక కళ్లు. . కొండపాకుతున్న కోడెనాగులా భుజమ్మీద జడా "

"ఆహా! కవిత్యం గూడానా!" బలవంతంగా విడిపించుకుంది కవిత్వం శృతిమించితే పైత్యం పతిదేవా! ముందు అటు వెళ్ళండి కళ్లతో బాత్రూంచూపించింది.

"నా పేరు పతిదేవ కాదు పద్మారావు పూవుపుట్టగానే పరిమళిస్తుందన్నట్టు నేను పుట్టగానే సంగీత కచేరీ చేసిన్నటా! అదివిని డాక్టర్లూ, నర్సులూ ఈ లోకాన్నే మరిచి పోయింర్రటా...."

"ఇంకానయం. " కిలకిలా నవ్వింది "ఈలోకాన్నే విడిచిపెట్టారనలేదు పుట్టగానే కెవ్వుమని ఏడిస్తే హస్పిటల్ స్టాఫంతా జడుసుకుని పారిపోయుంటారు. " పగలబడి నవ్వింది

"అబ్బా. గుంటూరు గుమ్మవన్పించుకున్నావోయ్!" "మీరు మాత్రం సిద్ధిపేట చిన్నోడన్పించుకుంటున్నారు గదా ముందు తెములండీ . ."

"సరేగాని. .. ఏదో చిన్నమాటన్నావు గదా! చెప్పేయ్ అదేందో"
"ఆ.... చెప్పాలా! . . ఎందుకులెండి...!"

"వానరాని మేఘాలోలె ఎందుకట్లా వెనకా ముందాడ్తవ్. చెప్పేయ్."

"మరేంలేదు.. " బుంగమూతి పెట్టి కొంటెగా చూసింది "ఈ రోజు గోంగూర పచ్చడి చేస్తానండీ. అందటే నాకెంతో...." చెక్కిలిమీద చిటికె పడింది నరాలు స్వరాలు పలికినై.

"గోంగూరనా, గొంగడి బొంతనా! ఇయ్యాల్ల దొండకాయ ముద్దగాయ చెయ్. అవి నీ పెదాలలెక్క కమ్మగా..." నాలుగు పెదాలోకటై పోయినై.

"చాల్లెండి సంబడం!" భుజాలు పట్టి నెట్టేసింది. "బంగారం లాంటి గోంగూరకు నేను దూరం కావాల్సిందేనా? గోంగూరను తెలంగాణాలో ఎక్కువ తినరు కానీ... రుచంటే గోంగూర పచ్చడిదే... కారం కారం, పుల్లపుల్లగా కమ్మకమ్మగా... ఓసారి తిని చూడండి. నా సామిరంగా .."
"అసలు రుచంటే దొండకాయ ముద్దగాయదేనోయ్. కారం కారం, ఉప్పుప్పగా, కొంచెం పుల్లపుల్లగా . మూడు రుచుల త్రివేణీ సంగమం. మస్తుగుంటది గుంటూరు పిల్లా!" లొట్టలేశాడు

"దాంతోపాటు బుద్ధిమాంద్యం! గూడా వస్తుంది సిద్దిపేట చిన్నోడా!" చిరుకోపం చిర్రెత్తిందింది

"ఎవడో బుద్ధిమందగించిన వాడనుంటాడామాట అయినా ఈనెలలో దొండకాయను మూడుసార్లు మూడురకాలుగా వండానుగా!"

"మూడుసార్లు వండినా, ముప్పైసార్లు వండినా ఈరోజు దొండకాయ కూడ వండాల్సిందే గోంగూర సంగతి గంగలో కలిపెయ్."

"ఐతే ఈ మొండి మొగుడికి నాతడాకా చూపించాల్సిందే" రోషంతో మొహం ఎర్రబారింది

"కుదరదు ఈరోజు నేను గోంగూర పచ్చడి చెయ్యాల్సిందే మీరు తినాల్సిందే మొండికేసింది

"ఉహూ! దొండకాయనే...."

"అయ్యో..." కోపంగూడా వస్తుంది. దొండకాయ దండిగా తింటే మెదడు మొండికేస్తుందడీ, రుసరుస బుసబుస.

"గోంగూరంటే నాకు కంగారు వసంతా!"

"దొండకాయంటే నాకు పరేషాన్ బాబూ!"

పద్మారావులో పట్టుదల పెరిగింది. ఆడదానికి లొంగిపోతే బతుకంతా అడవిపాలైపోతుంది... "అసలూ.. మొగుడంటే మోటకేసిన మొద్దనుకున్నావా?"

"కాదు. ముద్దుల పెళ్లాం ముచ్చట దీర్చే మొనగాడనుకున్నాను అయినా. పెళ్లామంటే తమరేమనుకున్నారో" వసంతలక్ష్మిలాగున్న వసంత ముఖ పద్మం ముకుళించుకుపోయింది.

"బెల్లమనుకున్నా... కాని గోంగూరను గుర్తు చేయ్యకుమంటున్నా..."

"అదంటే నాకు ప్రాణం గదా!" ఆత్మాభిమానం హారతి కర్పూరమైపోతుంది. ఏమైనా సరే తెగించక తప్పదు. .."

"ఐనాసరే... అది నాకొద్దు" బిగుసుకు పోయాడు

నేను దేన్నైనా వదులుకుంటాను గానీ గోంగూరను వదులు కోను అది నా ఆరో ప్రాణం. " ఉక్రోషం ఉబికింది.

"నేను గూడా ఏ కూరనన్నా ఒప్పుకుంటాను కాని
గోంగూరంటే గొడ్డలందుకుంటా "

"ఆడదంటే ఈయనగారికంత చులకనెందుకో! ఇప్పుడు ఒప్పుకుంటే ముందు ముంద తిప్పలు తప్పవు . ముక్కుకు ముగుదాడు వేసి తీరాలి వాలకం గంభీరమైంది "అంతేనా! నా కోరిక కొంగలెత్తుకుపోయిట్టేనా!

"అదేమన్నా అమృతమా! పనికిరాని పంతానికి పొతున్నావు వసంతా! అసలూ నువ్వంటే నాకెంత ఇదో . నీకు తెలీదా!"

" ఆహా! మాటలు మాణిక్యాలు చెతలు చెత్తకుండీలు
" ఏది ఏమైన సరే . ఈరోజు గోంగూర పచ్చడి చేసి తీరుతా ."

"ఎగాదిగా చూసింది కళ్లల్లో కాంతి లేదు

"అప్పుడు నీ చెంపలు గూడా పచ్చడై పోతై జెర. జాగ్రత్త!"

"ఇదో చూడండీ!" దూరం జరిగి కుడికాలు నేలకు కొట్టింది. "చివరిసారిగా చేబుతున్నా." రోషంతో గుండెలెగసి పడుతున్నై "గోంగూర వద్దంటే నన్ను వద్దన్నట్టే... ఆ..." అభిమానం అవమానం అతలాకుతలమై కన్నీరుగా కదలాడినై.

"ఆడదాని కన్నీళ్లకు కరిగిపోతే మొగుడు మోటకేసిన మొద్దైపోతాడేమో! ఇంతదాక వచ్చింతర్వాత తగ్గేది లేదు.

"అయినా సరే .. గోంగూర వద్దు ." చూపుల్లోవేడి "అదే వండేస్తా. ఏమౌతుందో చూస్తా." మాటల్లో వాడి. మాటా మాటా పెరిగింది. పట్టుదల పట్టింపులు గట్టిగా ముడి పడిపోయినై తెగింపుదాకా వచ్చింది వసంత సూట్కేసు సర్ధుకుంటూంది. పద్మారావు బాత్రూంలోకెళ్లి తిరిగొచ్చాడు.

"ఇంత చులకైపోయాక నేనీ ఇంట్లో ఇక్క క్షణం గూడా ఉండలేను..." సూటుకేసు అందుకుంది.

"ఉండకుంటే ఊరికిపో.. తాటాకు చప్పుళ్లకు కుందేలు చెదరదు..."

"బెదిరింపు అదిరింపు కాదు. ఇది నా ఆత్మాభిమానానికి సంబంధించిన సంగతి... వస్తా" కొంగుతో కళ్లద్దుకుంటూ గడప దాటింది. అసలేం జరిగిందనే సంగతి అరగంట తర్వాత గాని అంతుబట్టలేదు పద్మారావుకు

* * * * * *

"బాహా, బాహోయ్ బావిగారండీ ఆహా! వంటింట్లో తంటాలు పడుతున్నారా!"

బ్రేకుల్లేని బస్సులె ఎవడ్రా అది వంటింట్ల దాకా పళ్లొడ్తాయ్ గాడిదకొడకా .!" గ్యాసుపొయ్యి దగ్గర గరిట తిరిగింది

"అయ్యయ్యో! అప్పుడే చూపు మందగించింది! గాడిద కొడుకు కాదు బావా! గణేశ్‌రావు సుపుత్రుణ్ణి నీ గారాల బామ్మర్ధిని భవానీ శంకరాన్ని బావాశ్రీ!"

"ఓహ్! నువ్వా! నీ పందిమొహం నాకు చూపించకూ!" పెళ్లాం ఫరారైందని నేనేడుస్తుంటే వీడొకడు! కోపమొచ్చింది. గరిట గాల్లోకి లేచింది.

"నాది పందిమొహం కాదు పద్మారావు గారూ! నంది మొహం. అలా నరకాసురడిలా ఎగబడే కంటే ఓ కళ్లజోడు కొనుక్కుంటే బావుంటుంది గదా! .." గరిట లాక్కున్నాడు.

అన్నం పొంగిపోతుంది- .పద్మారావు వంతంలా బామ్మర్ధిమాటలు ఈటెల్లా గుచ్చుకుంటున్నై. "నేను.... నే...నే... నరకాసురుణ్ణా? న....రు. ..కు...తా! తనకు సంభాళించుకోవడం కష్టమైపొయింది.

"సొరకాయలా, బీరకాయలా?" కిసుక్కుమన్నాడు అన్నంలాగే పద్మారావు నరాల్లో రక్తం కుతకుతలాడ్తోంది పరాభవమ్మును సయింతునా. పరాక్రమించక క్షమింతునా..!

"న్నీ నీ తలకాయను..." దమ్మొచ్చేసింది ఆయాసంతో కాస్సేపు మాట రాలేదు. ఓ నిముషం తర్వాత నిదానమైంది "ఎందుకొచ్చినవ్? నా ఇంటికి రమ్మని నీకేమన్నా పత్రిక పంపిన్నా?"

"పవిత్రమైన పనికి పత్రికెందుకు బావాశ్రీ? మా అక్క... పూవులాంటి మా వసంతక్కను పూలకారులో ఎక్కించి మీ ఇంట్లోదింపి మీ చేతుల్లో పెట్టాం..."

"చంచాగిరి చేస్తున్నావా?" అన్నం దింపేసి పాలు పెట్టేశాడు

"ఛఛా... చచ్చీచెడి . బెజవాడ మీదుగా భాగ్యనగర్ దాటొస్తే ఇదేనా మర్యాద? ఇదేనా నాగరకత? ఇదేనా ఓబావ తన బామ్మర్దికివ్వాల్సిన అతిధి సత్కారం. ఇదేనా మానవత? ఇదేనా ." అయాసమొచ్చి గొంతు తడారిపోయింది కళ్లల్లో నీళ్లు తిరిగినై

"కాదు బావా! మా వసంతక్క పరిస్థితి మాన్యులైన మా బావగార్కి . అనగా తమరికి చెబుదామనీ "

ఓహో .. పశ్చాత్తాపం ప్రారంభమైందన్నమాట ''

"చాల్చాల్లేవోయ్ ఆ ముద్దావతారం అక్కకు ఈ గద్దావతారం తమ్ముడు '' అనిర్వచనీయమైన ఆనందం

"అప్పుడు . మా అక్కను ముద్దమందారమన్నావు బావా!"

"అబ్బా నువ్విప్పుడు గోంగూర రాయబారాని కొచ్చినావా?"

"రాయబారం కాదు . రాచకార్యం"

"అదికావు బామ్మర్దీ! నా ఇష్టమొచ్చిన కూడ వండుంటే."

"మీరలా మొండికేస్తే ఎలా బావా! ముందు నేను చెప్పేది ."

"వినను నిన్నూ.." పాలుపొంగి పొయ్యిమీద పడిపోయినై.

"అయ్యయ్యో ... పదిరూపాయల పాలు."

"ఇదసలూ.. వంటిల్లా వల్లకాడా! వసంతక్క లేని ఇల్లు ఇల్లెంతకుంట సంతలాగైపోయింది. కాఫీ లేని కప్పులాగై పోయావు బావా! నీ మాటలు ఉప్పులేని పప్పులాగున్నాయి బావా... అయ్యయ్యో... నీకెంత కష్టమొచ్చింది బావా....

పద్మారావు బుర్రలో అనుమానం పురుగు తొలిచింది. కళ్లెత్తి ఇల్లంతా కలియజూశాడు. నిజమే . వసంత లేకపోతే ఇల్లు ఆకురాలు కాలంలో అడవిలాగై పోయింది. నవ్వాలో. ఏడ్వాలో అర్థంకాలేదు. కాని. . ఇప్పుడు నవ్వే శరణ్యం. "ఆహ్హాహ్హా! నువ్వెంత అమాయకుడివోయ్ జవానీ శంకరం"

"నా పేరు జవానీ శంకరం కాదు.. "

"కాపోతే దివానీ శంకరం..."

"అదిగూడా కాదు . అయ్యో బావా..."

"ఏదో ఒకట్లే గానీ... ఇది మెగాటౌన్. పూటకో హోటల్లో పూటుగా భోంచేసి కాలుమీద కాలేసుక్కూచుంటున్నా ఇయ్యాల ఆదివారం గదాని నిన్ననే వంటల పుస్తకం దెచ్చినా"

"అయ్యో, అక్కయ్యా - బావగారు నన్నేమీ చేప్పనివ్వడం లేదు. నీ పరిస్థితి ఎట్లా జెప్పలే.. అయ్యో అక్కయ్యా నీ కాపురం మూడుపూవులారుకాయలనుకన్నాను గాని.... నువ్వెట్లున్నావని గూడా అడగడం లేదే అక్కయ్యా..." కావాలనే దుఃఖం తోసుకొస్తుంది వస్తుంది

· అరెరే వసంతకేమైందో పద్మారావు గుండె గుప్పెట్లో కొచ్చింది కానీ ప్చ్ "మీ అక్కకేమైందోయ్! రోజుకు మూడుపూటలా తింటూ ఆరు సినిమాలు చూస్తుంది గదా!"

"కాదు కానే కాదు నేనెట్లా జెప్పలే అక్కా" వాల్యూం పెరిగింది

వీడేదో దుర్వార్త మోసుకొచ్చినట్టుంది వసంతకేమైందో ఏమో! భగవంతుడా. ఆమెను చల్లగా చూడు "గట్లా నీళ్లు లేని బాయిల పడి నడ్డిరగ్గొట్టుకున్నట్టు మొత్తుకును డెందుకో! అసలు సంగతేందో చెప్పేడ్వొచ్చు గదా!"

"చెప్పాలా సరే . అక్కడ మా వసంతక్క అయినా మా అక్క సంగతి మీకక్కరలేదేమో.. చెప్పిగూడా ఏం లాభం?"

"అయ్యయ్యో వసంతా... నీకేమైందో!" నవనాడుల్లో ఆవేశం అంగలేసింది. బామ్మర్దిని కొరికి పారెయ్యాలన్పిస్తుంది.

"ఓయ్ పిచ్చి శంకరయ్యా! సస్పెన్స్‌ల వెడితే నీ తలకాయ సవాలక్ష వక్కలైపోతది నా వసంతనేం జేసింగ్రో చెప్పు" గల్లా అందుకున్నాడు.

"మేమేం జెయ్యలేదు బావా! మా అక్కయ్యనే నిన్న మధ్యాహ్నం గోంగూర పచ్చడితో బోంచేసి వచ్చి వరండాలో ఢామ్మని పడిపోయింది..."

పద్మారావు గుండెల్లో అణ్వాస్త్రం పేలింది "ఆ... ఆ . . వసంత పడిపోయిందా! గొంగూర ఎక్కువై పైత్యం చేసిందా లేక... అయ్యో. . మీరంతా ఏంజేస్తున్నట్టు.... గాడిద పండ్లు తోముతున్నారా?"

"అంత అదృష్టం గూడానా.....!" అంటే.... వసంత... అమాంతం... అయ్యో దేవుడా! "అసలేమైందో చెప్పవోయ్ మొగుడా!"

"మా అమ్మ గుండెలు బాదుకుంది. నాన్నకు అయోమయం. నేనేమో అర్జంట్‌గా ఆటో తెచ్చా... వెంటనే హాస్పిటల్ కెళ్లాం. .."

"వెరీగుడ్.. అక్కడేమైందో చెప్పు!"

నీ యవ్వ .. అసహనం ఆకాశాన్నంటుకుంది "ఇంకో అరగంట దాకా అసలు సంగతి చెప్పవా?"

వెంటనే నీకు కబురు పెట్టుమన్నారు అమ్మా నాన్నలు "

"అయ్యో వసంతా నీకీ లోకంలో చిఛీ ఆ రిజల్ట్ జల్ది చెప్తవా లేక నీ పదహారు పండ్లు "

"చెప్తున్నాను బావా! మా అక్క తల్లి కాబోతుందంటూ తమరు తండ్రి కాబోతున్నారటా "

"ఓర్నియవ్వ! ." ఏనుగెక్కి ఊరేగుతున్నంత సంతోషమైంది. ఎంత ఖుష్ కబర్ చెప్పినవోయ్ శంకరయ్యా పదా. ఇహ పదా" చక చకా డ్రెస్సు మార్చుకున్నాడు ఖుషీగా ఈల వేశాడు. కాని మా వసంతక్కకు గోంగూరంటే ప్రాణం గదా!"

"నాకు మీ అక్కంటే ప్రాణం గదా! చూడు బామ్మర్ది గోంగూరంటే నాకూ ఇష్టమే కానీ .. ఆ రోజెందుకో... పంతానికొచ్చినం.... పోనీలే... రోజూ గోంగూరనే తినుమందాం. పదా.... ముందు మీ అక్కను చూడాలి పదవోయ్ . కాఫీ టిఫీన్లు కూడా రైల్లోనే. పదా.. మీ అక్కతో ఓ చిన్నమాట చెప్పాల్సుంది పదా! "

(మూసీ - ప్రత్యేక సంచిక - నవంబర్, డిసెంబర్ 2000)

